ప్రజాశక్తి

మంగళవారం 23 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బెదిరిస్తే ఎదిరిస్తాం

టెర్మినేషన్ ఆర్డర్లపై పోరాడతాం
సమ్మె పట్టుదలతో అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీల హక్కుల పోరాటం 43 రోజులుగా కొనసాగుతున్నా వారిలో పోరాట పటిమ ఏ మాత్రం సడలిపోవడం లేదు. ఇంకా ముందుకే సాగుతామంటూ క్షణ క్షణం ప్రభుత్వ దుర్నీతిపై ప్రజలకు వివరిస్తామని తాజాగా చెబుతున్నారు. ప్రభుత్వం మంకు పట్టు వీడకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో లక్షల మంది పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే తల్లులు అంగన్‌వాడీలు. వేల సంఖ్యలో గర్భిణీల ఆరోగ్యాన్ని, ఆహార అవసరాలను గ్రామస్థాయిలో చూసే వీరి చిన్న చిన్న డిమాండ్ల పట్ల ఇంత సాగతీత అవసరమా? అనే చర్చ విశాఖ వాసుల్లో మొదలైంది. ఎక్కడో ఒక దగ్గర పరిష్కారం కావాలని, వారి ప్రధాన డిమాండ్ అయిన కనీస వేతనాలను అమలు చేయాలన్న (అదీ కూడా జగన్ గతంలో ఇచ్చిన హామీయే) విషయంలో ఎంతో కొంత ప్రభుత్వం పెంచి

పెందుర్తిలో అరెస్టయి విడుదలైన అనంతరం నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఉండి ఉంటే అంగన్‌వాడీలు కొంత మేర సంతృప్తి చెందేవారంటూ చర్చలు నడుస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టకుండా విధుల్లో చేరకపోతే టెర్మినేషన్ల ఆర్డర్లను ఇచ్చేప్రక్రియకు రంగం సిద్ధం చేసింది. వీరిని వదిలించుకోవాలనే మిగతా 2లో..

సడలని పట్టుదల

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీల్లో పట్టుదల సడలలేదు. సమస్యలు పరిష్కరించుకొనే వరకు పోరాడాలన్న సంకల్పం చెక్కు చెదరలేదు. ప్రభుత్వ నిర్బంధంతో వారి పోరాటం మరింత గట్టిపడుతోంది. అంగన్‌వాడీల పోరాటం ఒక చర్చనీయాంశంగా మారింది. సమ్మెను విచ్ఛిన్నం చేయాలన్న ప్రభుత్వ కుట్రలను తిప్పికొడుతూ ముందుకుసాగుతున్నారు. ప్రభుత్వమెన్ని అస్త్రాలు సంధించినా, వాటన్నింటినీ చేధించుకుంటూ రావడంతో, చివరి అస్త్రంగా విధులకు హాజరుకాకపోతే టెర్మినేషన్ ఉత్తర్వులు జారీచేస్తామని బెదిరింపులకు దిగింది. సమ్మె నుంచి వెనక్కు తగ్గితే ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించదని తెలిసిన అంగన్‌వాడీలు ఆది నుంచీ అదే పట్టుదల ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధ చర్యలు ఖండిస్తూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో నిరసన చేపట్టారు. అనకాపల్లి పట్టణం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని కార్మిక, కర్షక భవన్ నుంచి నెహ్రూ చౌక్ వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆదివారం బయలుదేరిన అంగన్‌వాడీలను విజయవాడ వెళ్లకుండా బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, మార్గమధ్యంలో పోలీసులు ఆపేశారు. అక్రమ అరెస్టులు చేశారు. ఇంటి నుంచి బయటకు రాకుండా కొంతమందిని ఆదివారం గృహ నిర్బంధం చేశారు. సోమవారం కూడా ఈ నిర్బంధం కొనసాగింది. అచ్యుతాపురంలో తన ఇంటి నుంచి బయటకు రాకుండా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రామును గృహ నిర్బంధం చేశారు. నిర్బంధం, అక్రమ అరెస్టులపై అనకాపల్లి సహా సబ్బవరం, చోడవరం, నర్సీపట్నం, రాంబిల్లి, పరవాడలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనకాపల్లిలో అంగన్‌వాడీలు చేపట్టిన ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పాల్గొని మద్దతు తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, కోశాధికారి కర్రి అప్పారావు, జి.నాయనబాబు సంఘీభావం ప్రకటించారు. ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదుల నుంచి అంగన్‌వాడీలకు మద్దతు పెరుగుతోంది. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ చర్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. విధులకు హాజరుకాని అంగన్‌వాడీలను తొలగిస్తామన్న ఉత్తర్వులకు భయపడకపోవడంతో పై అధికారులతో ఒత్తిడి తెచ్చి విధులకు హాజరయ్యే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తోంది.

ఓటర్ల తుది జాబితా విడుదల

విశాఖలో 19,42,593, అనకాపల్లిలో 12,73,591 మంది
రెండు చోట్లా మహిళలే అధికం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ / అనకాపల్లి ప్రతినిధి

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు సంబంధిం తుది ఓటర్ల జాబితాను ఆయా జిల్లాల కలెక్టర్లు సోమవారం విడుదలచేశారు.

విశాఖ కలెక్టరేట్ : తుది జాబితా విడుదల నాటికి విశాఖపట్నం జిల్లాలో 19,42,593 మంది ఓటర్లు ఉన్నారని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వెల్లడించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ జనవరి 12వ తేదీన ముగిసిందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రచురణ ప్రతిని సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. 2024 జనవరి 22 నాటికి జిల్లాలో 1,941 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,60,101 మంది పురుషులు, 9,82,380 మంది మహిళలు, 112 మంది థర్డ్ జెండర్ వెరసి 19,42,593 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 3,51,462 మంది, విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అత్యల్పంగా 2,06,943 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

2023 అక్టోబర్ 27న విడులైన ముసాయిదా ప్రచురణ నాటికి జిల్లాలో 19,15,682 మంది ఓటర్లు ఉండగా, అందులో 9,51,011 మంది పురుషులు, 9,64,538 మంది మిగతా 2లో..

వార్త మెయిన్‌లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల తదితరులు

రాహుల్‌కు క్షమాపణ చెప్పాలి

ఆలిండియా పోలీస్ కమెండో కాంపిటీషన్స్ ప్రారంభం

వార్త మెయిన్ 3లో..

29 నుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

వార్త మెయిన్‌లో..

రాజన్న ఆటోనగర్ నిర్మాణం చేపట్టాలి

వార్త 2లో..

స్టీల్ యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి

వార్త 4లో..



మొదటి పేజీ తరువాయి..

బెదిరిస్తే ఎదిరిస్తాం

వైఎస్ జగన్ ప్రభుత్వ తాజా వ్యూహంపైనా తీవ్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మండిపడుతుండడం కనిపిస్తోంది. చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడితే పోలీసులను ఉసిగొల్పి అర్థరాత్రి అరెస్టులకు ప్రభుత్వం పాల్పడడంపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. మగ పోలీసులను తమపైకి వదిలి నిర్బంధకాండను ప్రయోగించడం ఏమిటి? అని విశాఖలో పలువురు మహిళలు తీవ్ర బాధను వ్యక్తం చేస్తున్నారు. ఎస్మా వంటి నిరంకుశ చట్టాలను జగన్ ప్రభుత్వం తమపై ప్రయోగించడం పట్ల అంగన్‌వాడీలు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా ఊరుకునేది లేదంటూ అంన్‌వాడీలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

విశాఖ జిల్లాలో 776 కేంద్రాలు...

విశాఖ జిల్లాలో 776 అంగన్‌వాడీ సెంటర్లు నడుస్తున్నాయి. 7 నెలల నుంచి 3 సంవత్సరాల వరకూ 57 వేల మంది పిల్లలు, 3 నుంచి 6 సంవత్సరాల వరకూ 17వేల మంది పిల్లలు ఈ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకునే వారు ఉన్నారు. 16వేల మంది గర్భిణీలకు పోషకాహారాన్ని అంగన్‌వాడీలు దగ్గరుండీ చూసుకునే వారు. పిల్లలకు వండడం వంటివి చేయాలంటే గ్యాస్, మిగతా ఖర్చుల భారాన్ని మోయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం దయతో తమ డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలంటూ కోరుతూ రోడ్డెక్కారు. రోజు రోజుకూ రెట్టింపు ఉత్సాహంతోనే తమ సమస్యల కోసం ఉదయాన్నే అన్నం బాక్సు పట్టుకుని వచ్చి సొంత ఖర్చులతో రాను, పోను రవాణా భారాలను 43 రోజులుగా మోస్తూ ఉద్యమం సాగిస్తున్నారు. ఇది చిరుద్యోగులైన అంగన్‌వాడీలకు తలకు మించిన భారమే అయినా భరిస్తూ హక్కుల కోసం ముందుకు సాగడం కనిపిస్తోంది. ప్రభుత్వం మాత్రం వీరి డిమాండ్లను వెనక్కి లాగుతూ అత్యంత నిరంకుశంగా అణచివేసే పథక రచన చేయడంపై తాజాగా విశాఖ జిల్లా అంతటా ఉద్యమ స్ఫూర్తితో పోరాడేందుకు అంగన్‌వాడీలు ప్రజలు, ప్రజాసంఘాలు, సిఐటియూ సంఘం అండతో ముందుకే వెళ్తుండడం గమనార్హం.

24న రాష్ట్ర బంద్‌కు సిద్ధం

అందులో భాగంగా ఈ నెల 24న రాష్ట్ర బంద్‌కు సిఐటియూ, ఎఐటియుసి, టిఎన్‌టియుసి, ఐఎన్‌టియుసి మద్దతుతో అంగన్‌వాడీలు సిద్ధమవుతున్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

మహిళలు,133 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ వివరించారు. ముసాయిదా జాబితా తదుపరి కొత్తగా 1,64,048 మందిని ఓటర్ల జాబితాలో నమోదు చేయగా, 1,37,137 మంది మరణించిన, డబల్ ఎంట్రీ, వలసపోయిన వారిగా గుర్తించి జాబితా నుంచి తొలగించినట్లు స్పష్టం చేశారు. ముసాయిదా జాబితా తుది జాబితా నాటికి 26,911 మంది ఓటర్లు పెరిగినట్లు చెప్పారు. ఇందులో 9090 మంది పురుషులు, 17,842 మంది మహిళలు, 21 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. తుది జాబితా ప్రచురణ నాటికి జిల్లాలో 3,636 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, ఇందులో 3,501 మంది పురుషులు, 135 మంది మహిళా ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ సమావేశంలో సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిదులు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి జిల్లాలో 12,73,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 33,457 మంది ఎక్కువ నమోదయ్యారు. ఓటర్ల సవరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి సోమవారం విడుదల చేశారు. చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 1529 పోలింగ్ కేంద్రాల్లో మహిళా ఓటర్లు 6,53,505 మంది, పురుష ఓటర్లు 6,20,048 మంది, ట్రాన్స్‌జెండర్ 38 మంది వెరసి 12,73,591 మంది ఉన్నారు. గతేడాది అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా జాబితా తరువాత కొత్తగా 69,488 మందిని ఓటర్లుగా చేర్చగా, మరణించిన, వలసవెళ్లిన, రెండుసార్లు నమోదైన 53,604 మంది ఓట్లను జాబితా నుంచి తొలగించారు. ముసాయిదా జాబితా నాటికి 12,57,707 మంది ఓటర్లుగా నమోదుకాగా, తుది జాబితా నాటికి ఆ ఓటర్ల సంఖ్య 12,73,591కు పెరిగింది. తుది జాబితా నాటికి కొత్తగా 15,884 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన కొత్త ఓట్లలో మహిళా ఓట్లు 8,989 కాగా, పురుష ఓట్లు 6,904 వున్నాయి. ట్రాన్స్ జెండర్ ఓట్లు 47 నుంచి 38కు తగ్గాయి. ఆరు నియోజకవర్గాల్లోని 3,911 మంది సర్వీసు ఓటర్లలో పురుషులు 3,844 మంది, మహిళలు 67 మంది వున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత తుది జాబితా తయారుచేశామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ఎన్నికల తేదీ ప్రకటించిన తరువాత నామినేషన్ వేయడానికి చివరి తేదీకి పది రోజులు ముందు వరకు మార్పులు, చేర్పులు, తొలగింపులు చేయవచ్చని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన వివరించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
భీమిలి	1,78,957	1,72,488	17	3,51,462
విశాఖ తూర్పు	1,40,990	1,35,516	17	2,76,523
విశాఖ పశ్చిమ	1,04,844	1,02,089	10	2,06,943
విశాఖ దక్షిణం	1,06,764	1,03,334	33	2,10,131
విశాఖ ఉత్తరం	1,39,078	1,35,664	18	2,74,760
గాజువాక	1,61,225	1,62,434	12	3,23,671
పెందుర్తి	1,50,522	1,48,576	5	2,99,103
చోడవరం	1,10,561	1,04,450	6	2,15,017
మాడుగుల	95,921	91,291	11	1,87,223
అనకాపల్లి	1,09,148	1,01,744	5	2,10,897
యలమంచిలి	1,04,724	99,340	9	2,04,073
పాయకరావుపేట	1,25,595	1,21,911	2	2,47,508
నర్సీపట్నం	1,07,556	1,01,312	5	2,08,873

రాజన్న ఆటోనగర్ నిర్మాణం చేపట్టాలి

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ సిటీ విశాఖపట్నం స్క్రాప్ ఫ్రీ సిటీగా మార్చాలన్న లక్ష్యంతో నగరంలోని తుక్కు దుకాణాలు, గ్యారేజీలు, వాహనాల బాడీ యూనిట్లను తరలించడం కోసం ఆనందపురం మండలం కణమాం గ్రామంలో కేటాయించిన 157.77 ఎకరాల స్థలంలో తక్షణం ఆటోనగర్ నిర్మాణం చేపట్టాలని సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటోనగర్ నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించి, నిర్మాణ పనుల బాధ్యతను ఎపిఐఐసికి అప్పగించినట్లు గతంలో జిల్లా కలెక్టర్ చెప్పారని తెలిపారు. స్థల సేకరణకు అవసరమైన డబ్బును ప్రభుత్వం చెల్లించినట్లు చెప్పారన్నారు. ఆటోనగర్ నిర్మాణం కోసం ప్లాట్లు విభజించి ఇవ్వటానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారని, సిఐటియు నాయకులు వెళ్లి పరిశీలించగా అక్కడ ప్లాట్లు వేసిన ఆధారాలు లేవని చెప్పారు. రైతులకు ఇంకా రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉన్న కారణంగానే ఆటోనగర్ నిర్మాణానికి అవరోధం కలిగిందన్నారు. భూములు ధరలు పెరిగినందున ఇచ్చేందుకు రైతులు అభ్యంతరం తెలుపుతున్నారని తెలిపారు. మరోవైపు వందల కోట్ల విలువైన ఈ స్థలాన్ని కాజేయాలని అధికార వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. కార్మికుల పొట్టలు కొట్టే విధానానికి స్వస్తి చెప్పి ఇప్పటికైనా ఆటోనగర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న ఆటోనగర్ నిర్మాణానికి ముఖ్యమంత్రిచే శంకుస్థాపన చేయిస్తామని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ వైవి సుబ్బారెడ్డి స్క్రాప్ యజమానుల సంఘానికి హామీ ఇచ్చారని, ఆ తేదీకి శంకుస్థాపన చేయకుంటే ఆందోళనను తీవ్ర స్థాయిలో చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, కె.గణేష్, స్క్రాప్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖయ్యూం, సమీర్, ఎన్.రమేష్, విజయ, ఎవి.రమణ, షహీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

28న ఫిట్జీ 'ద్రోణాచార్య 360-డిగ్రీ స్కాలర్‌షిప్ పరీక్ష'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఫిట్జీ 'ద్రోణాచార్య 360–డిగ్రీ డయాగ్నోస్టిక్ స్కాలర్‌షిప్ పరీక్ష"ను ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ద్వారకా సెంటర్ హెడ్ వినోద్ అగర్వాల్ తెలిపారు. నగరంలోని హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పరీక్ష కోసం రిజిస్ట్రేషన్ ఈ నెల 26వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఐదు, ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.750, ఎనిమిది నుంచి ప్లస్ వన్ విద్యార్థులకు రూ.1500 అని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఇనిస్టిట్యూట్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని ఆర్‌టిసి కార్మికుల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఎపిఎస్‌ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఎ) జిల్లా కమిటీ అధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 5వ రోజుకు చేరాయి. దీక్షలను యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పిపిఎం.రాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రధానంగా కౌన్సిలింగ్ పేరిట చార్టులు వేయాలని, సీనియారిటీకి న్యాయం చేయాలని కోరారు. డ్రైవర్స్ ఎక్కువ శాతం 5, 6 తరగతులు చదువుకున్న వారే ఉన్నారని, వారికి డిజిటల్ చార్టులపై అవగాహన లేదని, సీనియారిటీ ప్రకారం పిలిచి చార్టు వెయ్యడానికి నిరాకరించడం అన్యాయమన్నారు. వారు కోరుకున్న చార్ట్ వేయడం ద్వారా ఆ రూట్లో ప్రయాణికులతో ఉన్న సత్సంబంధాల మేరకు ఎర్నింగ్స్ పెరగడమే కాకుండా నచ్చిన కండక్టర్లు డ్రైవర్లు ఒకే మాటపై ఒకే రూట్ పెట్టుకోవడం వల్ల మంచి ఫలితాలు వస్తా యన్నారు. దీక్షల్లో డివిజనల్ సెక్రటరీ ఎకె శివాజీ, ఆర్.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

1026వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1026వ రోజుకు చేరాయి. దీక్షల్లో మహిళా సమాఖ్య నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె.వనజాక్షి మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నందునే విశాఖ నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. రిజర్వేషన్లు అమలు జరిగి దళితులతో సహా అణగారిన అన్ని తరగతులకు ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి లభించిందన్నారు. వీటిని ప్రైవేటీకరణ చేస్తే రిజర్వేషన్లు లేకుండా పోతాయని, పేద మధ్యతరగతి వారికి ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆదాయానికి కూడా పెద్ద ఎత్తున నష్టం కలుగుతుందన్నారు. దీక్షలో మహిళా సమాఖ్య నాయకులు జి.జయ, పుష్పలత, పి.పద్మ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 19 నుండి విశాఖపట్నం న్యాయవాదుల సంఘం విధులను బహిష్కరిస్తూ చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. జిల్లా కోర్టు అవుట్ గేట్ తెలుగు తల్లి విగ్రహం ఉన్నచోట చేపట్టిన దీక్షలను ఉద్దేశించి సీనియర్ న్యాయవాదులు బేవర సత్యనారాయణ, ఐఎం.అహ్మద్, గుడిపల్లి సుబ్బారావు, పలకా శ్రీరామమూర్తి మాట్లాడుతూ, ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. న్యాయ పరిజ్ఞానం లేని వ్యక్తులు చేతుల్లో చట్టాన్ని పెట్టడం ప్రజల హక్కులని కాలరాయటమేనని పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల పేద సన్నకారు రైతులకి తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

'వెంకటేశ్వరమెట్ట' సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి–విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై నివసిస్తున్న వారి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు.

NARSIPATNAM MUNICIPALITY TENDER NOTICE

NARSIPATNAM MUNICIPALITY INVITES FOLLOWING TENDER ON 'e'-procurement Platform

Sl. No.	Grant Name and No of Work	Tender Calling	Total Value	Downlod Starting Date & Time	Download Ending Date& Time
1.	05 Works (15th FC Grant)	3rd Call	Rs. 12.00 Lakhs (05 Work)	23-01-2024 by 11:00 AM (3rd call)	29-01-2022 by by 03:30 PM (3rd Call)
2.	18 Works (15th FC Grant)	4th Call	Rs. 75.00 Lakhs (18 Work)	23-01-2024 by 11:00 AM (4th call)	29-01-2022 by by 03:30 PM (4th Call)
3.	02 Works (GF Grant)	4th Call	Rs. 8.00 Lakhs (2 Work)	23-01-2024 by 11:00 AM (4th call)	29-01-2022 by by 03:30 PM (4th Call)

For details logon to: www.apeprocurement.gov.in
Contacts Ph.No. 8008559277, 9848964429

Sd/- COMMISSIONER
NARSIPATNAM MUNICIPALITY

24న సినర్జీస్‌లో జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీలో ఈ నెల 24వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ, ఐటిఐ ఫిట్టర్, టర్నర్, మెకానిస్ట్, ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్, బీటెక్, ఎంటెక్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ పూర్తి చేసి ఆసక్తి కలిగిన యువతీ యువకులు బుధవారం ఉదయం 9 గంటలకు కంపెనీకి రెజ్యూమ్, సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపికైనవారికి రూ.12 వేలు నుంచి రూ.20 వేలు వేతనం నిర్ణయిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9292553352 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

IN THE HONOURABLE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. 239/2021 in D.R. 391/2013

Between:
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd.
Seethammapeta Branch, VSP-16
. . . Petitioner / DHR

And:
Mr.Ch.Aswani Kumar Raju & 5 Others
. . . Respondent / JDRS

NOTICE TO PROPOSED RESPONDENT / JDRS U/S 50 OF C.P.C

LR'S
JDR-8: Mr. Chakrala Aswani Kumar Raju, S/o. Late Suryanarayana Raju, Hindu, a/a 40 years, R/at D.No. 8-157/12, Varalakshmi Nagar, Vepagunta, Visakhapatnam - 530047.
JDR-9: Mr. Chakrala Sirishna, D/o. Late Suryanarayana Raju, Hindu, a/a 38 years, R/at D.No. 8-157/12, Varalakshmi Nagar, Vepagunta, Visakhapatnam - 530047.
JDR-10: Mr. Chakrala Pradeep, D/o. Late Suryanarayana Raju, Hindu, a/a 36 years, R/at D.No. 8-157/12, Varalakshmi Nagar, Vepagunta, Visakhapatnam - 530047.

ఇందుమూలంగా ఏవన్నందికి తెలియపర్చిది ఏమనగా పై నెంబరు అమలు పిటీషను ఇందలి డి.హెచ్.ఆర్.గారు తమకు రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మిమ్ములను చనిపోయిన 5వ జె.డి.ఆర్.తాలుకు వారసులుగా మిమ్ములను చేరిపించమని దాఖలు చేయగా సదరు పిటీషను **తేది 08-02-2024** వాయిదా అయివున్నది. సదరు వాయిదా దినమున మీరు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షముందు తీర్మానించబడును అని ఇందుమూలంగా మీకు తెలియపర్చడమైనది.

(By Order of Court)
M/s. PPS ASSOCIATES
P.MURALI GOPAL
Y.SUJATHA
J.V.PREMASAI
Advocates, D.No. 49-10-20,
Lalitha Nagar, Visakhapatnam.

నివాసమున్న చోటే పేదలకు పట్టాలివ్వాలి

సిఐటియు ఆధ్వర్యాన కార్మికనగర్ వాసుల ఆందోళన ... టిడికి వినతి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికనగర్ వాసులు

ప్రజాశక్తి- పెందుర్తి
నివాసమున్నచోటే కార్మికనగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిఐటియు నేత జగన్, ఐద్వా నేత లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇల్లు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నేత లక్ష్మి మాట్లాడుతూ కొన్నేళ్లక్రితం పోరాటం చేసి కార్మికనగర్ వద్ద పాకలు వేసి నివాసముంటున్న వారికి, అక్కడ కాకుండా వేరొకచోట ఇళ్లు నిర్మించి ఇస్తామని సిఎం జగన్ చెప్పడంతో వారంతా అసంతృప్తిగా ఉన్నారన్నారు. తాము నివాసముంటున్న ఇళ్లకే పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వపరంగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నేత రజిని, భూ పోరాట నాయకులు పాల్గొన్నారు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమం

పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- వేపగుంట : రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సోమవారం వేపగుంటలో జిఒ 388 ద్వారా అర్హులైన 640మంది పేదలకు పట్టాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి మురళి, తామర్ల నర్సింగరావు, బల్ల రాంబాబు, వరహానర్సింహమూర్తి, వి. మహేష్, బండి సత్తిబాబు, దాసరి సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : 50వ వార్డు మాధవధార జివిఎంసి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ ట్యాబ్ కెకె.రాజు సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటినుండి విద్యను ప్రోత్సాహనిస్తూ అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేకుండా అర్హతే ప్రాతిపదికన అందరికీ అందజేస్తున్నారన్నారు. సిఎం జగన్ ఇచ్చే పథకాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ హేమలత, పి.సునీత, కృష్ణారావు, ఎం.లక్ష్మీ, శ్రీనివాసరాజు, రాజం రాజు, ఎవిఎన్.రాజు, ఎంవి. రెడ్డి, రామ్మోహన్, సి.హెచ్ శ్రీను, రాంబాబు, రామారావు, రమేష్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాత సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

లక్ష్మీ అప్పారావు సన్మానం చేస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : విద్య, ఆర్థిక, రాజకీయపరంగా వెనుకబడి ఉన్న యాత కులస్తులు సామాజికంగా పురోభివృద్ధి సాధించాలంటే రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆండిబోయిన లక్ష్మి, అప్పారావు దంపతులను యాత కులపెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యాత సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో యాత కులస్తులు తమ కులాన్ని నమోదు చేయుటలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అప్పట్లో అవగాహన లేమితో శెట్టిబలిజగా నమోదు చేయించుకోవడంతో ఇబ్బందులకు పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్రలో యాత కులస్తులుగా గుర్తించి నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చోడి ఆదినారాయణ, అధ్యక్ష కార్యదర్శులు అంగటి రాము, గొర్ల సూరిబాబు, అండిబోయిన అప్పారావు బాడితబోయిన రాములప్పుడు, వనము శ్రీనివాసరావు, అంగటి మూర్తి, రీసు రమణ, వనము నాగేశ్వరరావు, పూడి రమణ, నడిగట్ల గురుమూర్తి, చప్పిడి నాగరాజు, సుక్క ఈశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


ఆందోళన చేస్తున్న రెల్లికాలనీ వాసులు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు నరవ రెల్లికాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం జనసేన ఆధ్వర్యంలో సచివాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా జనసేన నాయకుడు గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రెల్లి కాలనీలో నివాసముంటున్న వారికి నేటికీ పట్టాలు మంజూరు చేయలేదని, డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెల్లికాలనీ వాసులకు ఎస్‌టి కులధ్రువీకరణ జారీకి తహశీల్దార్ కార్యాలయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రెల్లికాలనీవాసుల సమస్యల పరిష్కారానికి జనసేన పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నేత శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్పందనకు ఐదు అర్జీలు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి ఎనిమిదో జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఐదు అర్జీలు వచ్చాయని జెడ్‌సి ఎం మల్లయ్యనాయుడు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, టౌన్‌ప్లానింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ విభాగానికి సంబంధించి ఒక్కో అర్జీ వచ్చిందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జెడ్‌సి వెల్లడించారు.

స్పందనలో మూడు వినతులు

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు అర్జీలు వచ్చాయని జెడ్‌సి బొడ్డేపల్లి రాము తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి చెరొక అర్జీ వచ్చాయని, వీటిని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగాల అధికారు లకు నివేదించినట్లు జోనల్ కమిషనర్ రాము తెలిపారు

వైసిపి రాక్షస పాలనకు త్వరలో విముక్తి

జయహో బిసి సభలో మాట్లాడుతున్న రాజుబాబు

ప్రజాశక్తి పద్మనాభం : రాష్ట్రంలో సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి రాక్షస పాలనకు త్వరలో విముక్తి లభిస్తుందని .భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పద్మనాభం జంక్షన్‌లో పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ అధ్యక్షతన నిర్వహించిన జయహో బిసి సమావేశంలో మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బిసిల సాధికారిత టిడిపి పాలనలో సాధ్యమైందన్నారు. బిసిలకు 33శాతం రిజర్వేషన్లను టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, అన్న ఎన్‌టిఆర్ కల్పించారన్నారు. వైసిపి పాలనలో బిసిలకు తీరని ద్రోహం జరిగిందని, కులం పేరుతో కార్పొరేషన్లు విడగొట్టి, చైర్మన్లు, పాలకమండళ్లను నియమించారే తప్ప, ఆయా కులాల అభ్యున్నతికి పైసా నిధులు విడుదల చేయలేదన్నారు. బిసిలకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా దుర్వినియోగం చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి బిసిలంతా ఘోరీ కట్టడం ఖాయమన్నారు. పాసర్ల ప్రసాద్, గంట నూకరాజు, కె.లీలావతి, బి పావని, దామోదరరావు, కె.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు

సాంకేతిక నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి -తగరపువలస : సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మెళకువలు నేర్చుకోవాలని ఇంజనీరింగ్ విద్యార్థులకు సాంకేతిక నిపుణులు సిహెచ్ సంతోష్ సూచించారు. సోమవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగనున్న వర్క్ షాప్‌లో సంతోష్ మాట్లాడుతూ, నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో సాంకేతిక నైపుణ్యాభివృద్ధితో పాటు ఎంచుకున్న సబ్జెక్ట్‌పై పట్టు పెంచుకోవాలని తద్వారా ఉన్నత ఉద్యోగాలను పొందవచ్చనివిద్యార్థులకు సూచించారు.

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ మాట్లాడుతూ డిజైన్ ప్రక్రియలో ఇంజనీర్లుఇతర నిపుణులకు సాంకేతిక సమాచారాన్ని తెలియజేయడానికి ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో ఉపయోగించే పిసిబి డిజైన్ చేయడానికి వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ విభాగ అధికారి వి శివ భాస్కరరావు, అధ్యాపకులు, 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు

'జాక్సా'కు అభినందన

ప్రజాశక్తి-పద్మనాభం : అంతరిక్ష పరిశోధనల్లో సత్తా చాటి, చంద్రుని ఉపరితలంపై కాలుమోపిన ఐదో దేశంగా జపాన్ నిలవడంపై పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా)కు అభినందనలు తెలియజేస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు.భారత్ సరసన జపాన్ నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రత్యేకాధికారి కె.గ్రేస్‌లీ ,పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ట్రా రన్‌లో కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖనగరంలో సోమవారం నిర్వహించిన ఐదు కిలోమీటర్ల అల్ట్రా రన్‌లోభీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల కెజిబివి విద్యార్థినులు పాల్గొన్నారు. వీరంతా వాలంటీర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మెడల్స్, టీ షర్ట్‌లు అందజేశారు

నేరాలు ఘోరాలు

కోడిపందెం ఆడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి -పరవాడ : పరవాడ పోలీసు పరిధి ఏడుమెట్ల మర్రి పాలెంలో కోడి పందేలు ఆడుతున్న నలుగురిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ జి.తేజేశ్వరరావు తమ సిబ్బందితో ఇ.మర్రిపాలెం గ్రామ శివారులో కోడిపందేలు శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు, వారి వద్ద నుండి రూ.2 వేలు నగదును, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పరవాడ :మండలంలోని ఫార్మాసిటీ సింహాద్రి జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న పరవాడ గ్రామానికి చెందిన గొర్లె రామారావును పరవాడ ఎస్ఐ జి.తేజేశ్వర్ రావు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆయన వద్ద నుండి 180 ఎమ్‌ఎల్, 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసికొని, సీజ్ చేశారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెందుర్తి ఎస్ఐగా రామకృష్ణ

ప్రజాశక్తి- వేపగుంట : పెందుర్తి ఒకటో పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎల్.రామకృష్ణ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఎస్ఐగా విధులను నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఎస్ఐ రామకృష్ణ

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మధురవాడ : మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి వుడా కాలనీ ఫీడర్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల 23న మంగళవారంఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ రెండవ జోన్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. పోర్ట్ కాలనీ, ఎన్‌జిఒ కాలనీ, సుద్ద గెడ్డ ఏరియా, వాంబే కాలనీ, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వేపగుంట : వేపగుంట సబ్‌స్టేషన్ నాయుడుతోట 11కెవి ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులు వంటి నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల 23న మంగళవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విరాట్‌నగర్, దుర్గానగర్, గౌతమ్ నగర్, సాయిమాధవ్ నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆనందపురం: మండలంలోని గిడిజాల విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఈనెల 23న మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపి ఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇ సురేష్ కుమార్ తెలిపారు. గుమ్మడివానిపాలెం, శొంఠ్యాం, గిడిజాల, వేమగొట్టిపాలెం, ముచ్చెర్ల, తాంగుడుబిల్లి , దిబ్బడిపాలెం, మిందివానిపాలెం, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, తర్లువాడ, గుడిలోవ, పాలవలస, మెట్టమీదిపాలెం , ప్రకృతివానిపాలెం, నాగరంపాలెం, గంటపేట తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, వ్యాపార, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

వైసిపి ప్రాంతీయ సమావేశానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో ఈ నెల 27న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాల్గొనే వైసిపి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమావేశానికి ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, తలశిల రఘురాం, విజయనగరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీను, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థల పరిశీలన చేశారు మండలంలోని మిందివానిపాలెం వద్ద స్థల పరిశీలన చేసి స్థానికులతో మాట్లాడారు కార్యక్రమంలో జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, గనిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

స్టీల్ యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి

సిజిఎమ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై యాజమాన్య వైఖరి మార్చుకోవాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్య రామ్ డిమాండ్ చేశారు. సోమవారం స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యంలో సిజిఎం (వర్క్స్) సోప్తి కార్యాలయంలో సమావేశంలో అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం రోజుకొక ఇంటర్నల్ సర్క్యులర్ జారీచేసి కార్మికులను భయాందోళనలకు గురిచేయడం సరికాద న్నారు. విశాఖ స్టీల్‌లో 5వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పార్లమెంటు సాక్షిగా ఇప్పటికే స్టీల్ మంత్రిత్వశాఖ ప్రకటిస్తే, ఇపుడు 30ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారిని మెడికల్ అన్‌ఫిట్ పేరుతో తొలగిస్తామనడం దుర్మార్గమన్నారు. భర్తీ చేయని ఖాళీలతో ఇప్పటికే కార్మికులపై అదనపు పనిభారం పడుతుంటే, ఇపుడు ఉన్నవారికి కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయంతో తొలగించాలనుకోవడం యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. క్రమశిక్షణ పేరుతో యాజమాన్యం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిజిఎం (వర్క్స్) సోప్తికి వినతిపత్రాన్ని అందించారు. దీనిపై స్టీల్ ప్లాంట్ సిజిఎం (వర్క్స్) సోప్తి స్పందిస్తూ, కార్మికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళతా నన్నారు. ప్లాంట్‌లో ఉత్పత్తికి అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు.

సమావేశంలో యాజమాన్య ప్రతినిధిగా స్టీల్‌ప్లాంట్ పర్సనల్ చక్రవర్తి, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, మిత్రపక్షాల నాయకులు డివి రమణారెడ్డి, కర్ర ప్రకాష్, సిహెచ్ సన్యాసిరావు, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, కష్ణమూర్తి, బంగారు నాయుడు, శ్రీనివాస్, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి పరీక్షల కేంద్రం ప్రారంభం

ప్రారంభిస్తున్న బ్రాండిక్స్ భాగస్వామి దొరైస్వామి.

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యపరీక్షల కేంద్రాన్ని బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరైస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల కంటిసంరక్షణ అవసరాలను తీర్చడంలో శంకర్ ఫౌండేషన్‌తో బ్రాండిక్స్ సుదీర్ఘ అనుబంధాన్ని కలిగి ఉందని గుర్తు చేశారు. కంటి సంరక్షణలో జాతీయ ప్రమాణాలతో సేవలు అందించడం ద్వారా శంకర్ ఫౌండేషన్ సమాజానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయకుమార్, కె రాధాకృష్ణన్, జిఎం (అడ్మిన్, ఆపరేషన్స్) డాక్టర్ నస్రిన్, డాక్టర్ శిరీష, డాక్టర్ మమత, డాక్టర్ సుబ్బారావు, శంకర్ ఫౌండేషన్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు..

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సిఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి -తగరపువలస : వివిధ కారణాల వల్ల మధ్యలో బడి మానేసిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా చదువు కొనసాగించేలా అవగాహన కల్పించారు. సోమవారం భీమిలి మండలం, చిప్పాడ, దివీస్ ఆధ్వర్యాన చిప్పాడలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత విద్యాసంవత్సరంలో టెన్త్‌కు సంబంధించి 15 మంది, ఇంటర్‌కు చెందిన18 మంది విద్యార్థులకు దివీస్ సంస్థ రూ 90వేలు పరీక్ష ఫీజు చెల్లించినట్లు వివరించారు. త్వరలో జరగనున్న పరీక్షలకు ప్రణాళిక ప్రకారం చదువు కొని ఉత్తీర్ణత సాధించాలని కోరారు. వీరికి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ శ్రీనివాస్, కె నరసింహ పాల్గొన్నారు

ఘనంగా శివనందేష్ జన్మదిన వేడుకలు

శివనందేష్‌కు కేకు తినిపిస్తున్న వెంకటజగన్, వైసిపి నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తనయుడు, ఉమ్మడి విశాఖ జిల్లా వైసిపి యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివనందీష్‌బాబు జన్మదిన వేడుకలను ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట్‌జగన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేకు కటింగ్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివనందీష్‌బాబును వెంకట్ జగన్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివనందీష్‌బాబు మాట్లాడుతూ, నియోజకవర్గంలో వైసిపి యువజన విభాగం బలోపేతానికి కృషి చేసి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలక పాత్ర పోషిస్తామన్నారు. కార్ర్యమంలో భీమిలి నియోజకవర్గ వైసిపి యువ నేతలు పాల్గొన్నారు

ప్రభుత్వ భూముల కబ్జా పట్టదా?

వైసిపి అక్రమాలకు అధికారులు కొమ్ము కాయడం దుర్మార్గం : టిడిపి ఇన్‌ఛార్జి

మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

ప్రజాశక్తి -గాజువాక : అధికార దర్పంతో వైసిపి నేతలు యథేచ్ఛగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ, జివిఎంసి అధికారులకు పట్టకపోవడం శోచనీయమని టిడిపి గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాస్ మండిపడ్డారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, జివిఎంసి 65వ వార్డు సర్వేనెంబర్లు 86, 273, 274లోని సుమారు రూ.80కోట్ల విలువైన ప్రభుత్వ భూములను స్థానిక తహశీల్దార్, జివిఎంసి ఆరోజోన్ టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారంతో స్థానిక వైసిపి కార్పొరేటర్, నాయకులు కబ్జా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.

దీనిపై గడచిన నాలుగున్నరేళ్లకు పైగా టిడిపి ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాపై తహశీల్దార్, జెడ్‌సి, టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరులో ఇసుమంతైనా మార్పు లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో గాజువాక తహశీల్దార్, జోనల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 65వ వార్డు టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి అంగ కృష్ణ, టిడిపి బిసి విభాగం గాజువాక పధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వర రావు, తెలుగు యువత అధ్యక్షుడు కె. అప్పలరాజు ప్రధాన కార్యదర్శి శుక్లా కామేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు శివంగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి పెద్దపీట

మాట్లాడుతున్న జివిఎంసి ఫ్లోర్‌లీడర్ హనోక్

ప్రజాశక్తి-సీతమ్మధార: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జివిఎంసి ఫ్లోర్‌లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ అన్నారు 45వ వార్డు సోనియాగాంధీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా, మహిళలకు పెద్దపీట వేస్తూ సిఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ఆసరా సాయాన్ని అందజేయనున్నారని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఎపిడి పద్మావతి, సిఒలు శ్రీను, హరి పట్నాయక్ నాయుడు,మహిళలు పాల్గొన్నారు

పేదలకు దుప్పట్లు పంపిణీ

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీను దంపతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని రావాడ గ్రామం వరసిద్ధి వినాయక ఆలయం వద్ద అవనాపు నరసింహులు జ్ఞాపకార్థం అతని కుమారుడు అవనాపు శ్రీను, రమణమ్మ దంపతుల ఆర్థిక సాయంతో సమకూర్చిన దుప్పట్లను వంద మంది పేదలకు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. నరసింహులు జ్ఞాపకార్థం ఏటా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో సంతృప్తి నిస్తున్నాయని శ్రీను దంపతులు తెలిపారు

ప్రజా మన్ననలు పొందేలా సేవ చేశాను..

మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనర్సింహరాజు

ప్రజాశక్తి -పద్మనాభం: ఎమ్మెల్యేగా, మంత్రిగా తన రాజకీయ ప్రస్థానంలో ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించానని మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నర్సింహరాజు అన్నారు. ఈనెల 23న తన 78వ పుట్టినరోజు సందర్భంగా ప్రజాశక్తితో తన బాల్యం, రాజకీయ జీవితంపై పలు అంశాలను వివరించారు.

బాల్యం.. చదువు

మండలంలోని పాండ్రింగి గ్రామంలో పద్మనాభరాజు, అచ్యుతాయమ్మ దంపతులకు 1946 జనవరి 23న జన్మించిన అప్పలనర్సింహరాజు, ప్రాథమికోన్నత విద్యను భీమిలిలోనూ, తర్వాత పియుసి పూర్తిచేసి, 1971లో విజయనగరంలో మహరాజా కళాశాలలో చేరి ఉన్నతవిద్యను పూర్తి చేసుకున్నారు.

రాజకీయ నేపథ్యం

తండ్రి పద్మనాభరాజు భీమిలి సమితి ప్రెసిడెంట్‌గా వ్యవహరించగా, తండ్రి నుంచే రాజకీయ వారసత్వాన్ని అందుకున్న అప్పలనర్సింహరాజు 1980లో పాండ్రింగి పిఎసిఎస్ అధ్యక్షునిగా పనిచేస్తున్న సమయంలో 1983లో ఎన్‌టి రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి, నేటివరకు అదే పార్టీలో కొనసాగుతున్నారు.అన్న ఎన్‌టిఆర్ ప్రోద్బలంతో 1985లో భీమిలి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొంది, అలాగే 2004వరకు కొనసాగారు. 1989లో ఎన్‌టిఆర్ కేబినెట్‌లో మంత్రిగా, ఆర్‌టిసి చైర్మన్‌గా పనిచేశారు.

కనీస సౌకర్యాల కల్పనకు కృషి

నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలల ఏర్పాటు వంటి కనీస మౌలిక సౌకర్యాల కల్పనకు విశేష కృషి చేసిన అప్పలనర్సింహ రాజు, .గోస్తనీనదిపై వంతెన నిర్మాణాలు, విశాఖ జిల్లాకు ప్రత్యక రూపకల్పన చేశారు. మన్యంలోని గిరిజనుల అభివృద్ధికి పాఠశాలలు, హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. బడుగు బలహీన వర్గాలకు గూడు కోసం శాశ్వత గృహనిర్మాణాలను చేపట్టారు. బిసి, ఎస్‌సి పిల్లల విద్యాభివృద్ధికి ఎస్‌సి, బిసి హాస్టళ్లను ఏర్పాటు చేశారు. వివాదరహితుడిగా, సౌమ్యుడిగా, నిస్వార్థప్రజా నాయకుడిగా మన్ననలు పొందిన అప్పలనర్సింహం, టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకు అదేపార్టీలో కొనసాగుతూ, మచ్చలేని నేతగా గుర్తింప ఉ పొందారు. మంగళవారం 78వ పుట్టినరోజు వేడుకను జరుపుకోనున్న ఆయనకు పార్టీ శ్రేణులతోపాటు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్ క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె కె రాజు అన్నారు. సోమవారం నియోజకవర్గంలో పలు ప్రాంతాల నుంచి వచ్చి ప్రజల సమస్యలను నేరుగా విని, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అర్ధరాత్రి అంగన్వాడీల అడ్డగింత

- వేంపాడు టోల్ గేట్ వద్ద వాహనాలను అడ్డుకున్న పోలీసులు
- నిరసనగా అక్కడే బైఠాయింపు

ప్రజాశక్తి -నక్కపల్లి

కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అంగన్వాడీ రాష్ట్ర యూనియన్‌లు పిలుపు మేరకు విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు పాడేరు, విశాఖపట్నం, అనకాపల్లి తదితర జిల్లాల నుండి బస్సులు, టాటా మ్యాజిక్, జీపులు వంటి వాహనాల్లో విజయవాడ వెళ్తు న్న వారిని నక్కపల్లి మండలం వేంపాడు టోల్ గేట్ వద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో నక్కపల్లి పోలీసులు అడ్డుకున్నారు. అంగన్వాడి వర్కర్స్ ఎంత విజ్ఞప్తి చేసినా పోలీసులు పట్టించుకోలేదు. వాహన డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. అంగన్వాడి వర్కర్స్‌ను అడ్డుకున్న విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు వేంపాడు టోల్ గేట్ దగ్గరకు చేరుకుని, పోలీసులతో మాట్లాడి వాహనాలు విజయవాడ పంపించాలని కోరారు. ఇక్కడ నుండి పంపడం జరిగదని పోలీసులు తెగేసి చెప్పారు. దీంతో ఎం.అప్పలరాజు అంగన్వాడీలతో కలిసి టోల్ గేట్ వద్ద రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు, పోలీసులకు మధ్య తీవ్రంగా వాగ్వివాదం, తోపులాట జరిగింది. టోల్ గేట్ వద్దకు జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ వచ్చి పోలీసులకు పలు సూచనలు చేశారు. అంగన్వాడీలు చలిలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంగన్వాడీలను బలవంతంగా ఎక్కడ నుండి వచ్చారో ఆయా ప్రాంతాలకు పోలీసు పహారాతో పంపించారు. ఎస్‌పి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో టోల్ గేట్ వద్దకు వచ్చి ఆదేశాలు ఇచ్చారంటే ప్రభుత్వం ఎంత నియంత్రత్వంతో ఉందో అర్ధమవుతుందని సిపిఎం నేత అప్పలరాజు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.శ్రీను, ఎం.నానాజీ పాల్గొన్నారు.

వేంపాడు టోల్ గేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలు

సిఐటియు నేత రామును గృహ నిర్బంధం చేసిన దృశ్యం

సిఐటియు నాయకుల గృహ నిర్బంధం

అచ్యుతాపురం : అంగన్వాడీల సమస్యలపై చలో విజయవాడ నేపథ్యంలో సిఐటియు నాయకులను పోలీసులు సోమవారం గృహ నిర్బంధం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము ఇంటికి ఆదివారం సాయంత్రం నుంచి పలుమార్లు పోలీసులు తిరిగారు. ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం రాము తన ఇంట్లో ఉండగా పోలీసులు వచ్చి గృహ నిర్బంధం చేశారు. అలాగే సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడును భోగాపురం గ్రామంలో ఆయన ఇంటి వద్ద నిర్బంధించారు. ఈ గృహనిర్బంధాన్ని రాము తీవ్రంగా ఖండించారు.

అంగన్వాడీల నిర్బంధంపై సిపిఎం ఖండన

కె.కోటపాడు : అంగన్వాడీలు తమ న్యాయపరమైన సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా విజయవాడ వెళుతుండగా ఆదివారం రాత్రి నక్కపల్లి వద్ద పోలీసులు అంగన్వాడీలను అడ్డుకొని నిర్బంధించడాన్ని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కోటి సంతకాల సేకరించి వాటిని తీసుకొని వెళ్తున్న మహిళలను రోడ్డుపైనే నిర్బంధించడం దారుణమన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైసిపి నేత భరత్‌కుమార్

తేగాడలో 62 మంది రక్తదానం

ప్రజాశక్తి- కశింకోట : రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ జన్మదినం సందర్భంగా కశింకోట మండలం తేగాడ గ్రామంలో వైసిపి యువజన నాయకులు నీటిపల్లి దివాకర్ ఆధ్వర్యంలో అమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ జి.కిరణ్ సహకారంతో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత కుమార్ ఈ శిబిరం ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 62 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు మలసాల ధనమ్మ, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, అమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల దీక్షలకు కొణతాల సంఘీభావం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం తీసుకొర్చిన ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్యం చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అనకాపల్లి న్యాయ స్థానం ఆవరణలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సోమవారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తి హక్కులను హరించే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి లక్ష్మణ్, సురా శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'బాబు షూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 80వ వార్డు పరిధి చినరామ స్వామి కోవెల మొండుగూడెం వేపచెట్టు,చిన బోయగూడెం ప్రాంతాల్లో సోమవారం తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి, వాణిజ్యం ఆధికార ప్రతినిధి కర్రి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకి గ్యారెంటీపై ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

క్రికెట్ క్రీడాకారులకు టీ షర్టులు వితరణ

ప్రజాశక్తి- పరవాడ : పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని జివిఎంసి 88వ వార్డు పరిధి వెదురుల నరవ గ్రామంలో ప్రీమియర్ లీగ్ 8వ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు పరవాడ జెడ్పీటీసీ పిఎస్.రాజు తమ సొంత నిధులతో ఆర్మీ టీ షర్ట్‌లను ఆదివారం సాయంత్రం అందజేశారు. జెడ్‌పిటిసికి క్రీడాకారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సబ్బవరం : జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరంలో 29 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 88వ వార్డును ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇటీవల కొత్తూరు నుండి నంగినారపాడు హైస్కూల్ వరకు ఉన్న రోడ్డును కూడా ఏడు కోట్ల 75 లక్షలతో పనులు చేపట్టి 80శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, వైఎస్‌ఆర్సిపి ఇన్చార్జ్ జి కనకమాలక్ష్మి నాయుడు, మాజీ కార్పొరేటర్ సిహెచ్ నాగరాజు, కన్వీనర్ మాటూరి అప్పారావు, ఎం.రాజు, ఎస్.బొర్రయ్య నాయుడు. ఎం సాయి, వైఎస్‌ఆర్సిపి సీనియర్ నాయకులు దాడి నూకరాజు, శేఖర మంత్రి శ్రీనివాసరావు, సిహెచ్ అప్పలనాయుడు. సిహెచ్ తాతారావు. సిహెచ్ కనకరాజు, సిహెచ్ అప్పలరాజు, పిటి శ్రీను, బి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

చందును కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-మునగపాక : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందుని సోమవారం నాగులపల్లిలోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాసరావు, ఇతర నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చందు చేసిన సేవా కార్యక్రమాలను తెలుసుకుని ప్రత్యేకంగా అభినందనలు తెలిపేందుకు వచ్చినట్లు తెలిపారు. చందుని కలసిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రటరీ మారుతీ నారాయణ చక్రవర్తి, యలమంచిలి నియోజకవర్గం కో ఆర్డినేటర్ రాహుల్, పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, రావూరి రామ సత్యం తదితరులు ఉన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది జీతాలపై వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సెక్యూరిటీ సూపర్వైజర్ వరదపురెడ్డి తాతంనాయుడు, సెక్యూరిటీ గార్డు కె.అమ్మ తల్లి నాయుడు, సోమిరెడ్డి పోతురాజు, ఆర్ కొండబాబు, వి రమేష్, ఎం. కన్నబాబు స్థానిక గురుకుల కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్రనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరు, నవంబర్, డిసెంబర్ ఈ ఐదు నెలల నుండి జీతాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో భార్య పిల్లలు పోషణ కొరకు, తల్లిదండ్రులు అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ అవసరమైన మందులు కొనుక్కోలేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతభత్యాలు వేసిన తర్వాత మేము మరల విధుల్లోకి వస్తామని, మాకు వెంటనే జీతాలు వచ్చేటట్లుగా చూడాలని కోరారు.

వినతిపత్రం ఇస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

పంచాయతీ పారిశుధ్య కార్మికుల
వేతనాలు పెంచాలని ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. వీరి ఆందోళనలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీవో నెంబర్ 139 ప్రకారం కనీస వేతనాలను పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనిఫారాలు, గ్లౌజులు, కొబ్బరి నూనెలు, సబ్బులు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం స్థానిక ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి స్పందించిన ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, నాయకులు కె.కోటేశ్వరరావు, పారిశుధ్య కార్మికులు డి.పెంటారావు, జి లక్ష్మి, పి కనకమ్మ, బి పాపమ్మ, కే పైడిరాజు, ఎం అప్పారావు, కే అప్పారావు, కే వెంకటేష్, గేడ్డం బంగారమ్మ, గేడ్డం చిన్నారావు, పేట్ల అప్పారావు, ఎన్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభావతి, పారిశుధ్య కార్మికులు

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గవరపేట రామ కోవెల వద్ద సోమవారం సీతారాముల తీర్థ మహోత్సవాలు గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సీతారాముల ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం మహిళల చిడతల పోటీలతో పాటు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం, పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

పరవాడ : పరవాడ గ్రామంలో రెడ్డివారి పేరంటాలు శ్రీగుండాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమరాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పరవాడ పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పరవాడ సర్పంచ్ సిరిపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకారావు, వైసిపి నాయకులు బొద్దపు చిన్నారావు, పోతల అప్పల నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు తదితరులు

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక : మునగపాక సచివాలయంలో సోమవారం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను సర్పంచ్ దిమ్మల అప్పారావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ఆరోగ్యశ్రీ కార్డు విలువను పెంచడం జరిగిందని చెప్పారు. గతంలో రూ. 5 లక్షల విలువ గల ఆరోగ్యశ్రీ కార్డులను రూ.25 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఇప్పటికే తిమ్మరాజుపేట గ్రామంలో శాసనసభ్యులు రమణమూర్తి రాజు చేతుల మీదుగా కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, పంచాయితీ కార్యదర్శి పి ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీకి చెందిన ప్రో బోనో క్లబ్ సభ్యులు, జివిఎంసి ఎంజిఎం ఉన్నత పాఠశాల (డాబా గార్డెన్స్)లో 6, 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు న్యాయ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ చైర్ పర్సన్ వి.సునీత మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రాథమిక హక్కులను అర్థం చేసుకోవాలని, కనీస న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు సోషల్ మీడియాలో జరుగుతున్న నేరాలు, గృహహింస, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులు, పోక్సో చట్టం వంటి అనేక ముఖ్యమైన, కొన్ని సున్నితమైన అంశాలపై విద్యార్థులకు వివరించారు.

ఇవిఎం ఓటింగ్ యంత్రాలపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం అయితంపూడి గ్రామంలో సోమవారం ఈవీఎం ఓటింగ్ మిషన్లపై అవగాహన కార్యక్రమం రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటింగ్ ఏ విధంగా చేయాలో, ఓటింగ్ తీరు, వివి ప్యాడ్లపై పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రవణ్, గ్రామ సర్పంచ్ పెద్దాడ నాయుడు బాబు, ముచ్చకర్ల వెంకట్రావు, అప్పన పైడినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 82వ వార్డు పరిధిలోని 14వ సచివాలయం వద్ద టిడ్కో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయబడిన యాజమాన్య హక్కు పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు సోమవారం ఆ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, పట్టణ వైయస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్ఆర్సిపి కార్యదర్శి గైపూరి రాజు డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, దాడి భోగలింగేశ్వరరావు, కర్రి భాస్కరరావు, పిల్లా నరసింహారాజు, పేఖూరి కళ్యాణ్, డొంక సత్తిబాబు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పివివిఎస్ ప్రసాద్ కోరారు. మండలంలోని గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో విపసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు సోమవారం జరిగాయి. వ్యవసాయ ఖర్చులు తగ్గించే విధంగా డ్రోన్ వినియోగంపై రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తను వంతు కృషి చేస్తామని ప్రజలతో కలసి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. గుల్లేపల్లి గ్రామ సర్పంచ్ బండారు దేముళ్ళు, గొండుపాలెం గ్రామ సర్పంచి భర్త బండారు లక్ష్మణరావు పాల్గొన్నారు

కేంద్ర ప్రభుత్వ పథకాల కేలండర్‌ను అందజేస్తున్న దృశ్యం

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సేవలు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు మొదలైన సేవలన్నీ ఇక నుండి ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో దీనికి సంబంధించిన గోడపత్రిక (పోస్టర్)ను ఆవిష్కరించారు. ఎంప్లాయ్మెంట్ కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా employment.ap.gov.in ద్వారా సులభతరీతిన లభిస్తాయని చెప్పారు. పైన పేర్కొన్న సేవలు, అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలు / మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మొబైల్ ద్వారా కూడా పొందవచ్చన్నారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసినట్లయితే వెంటనే వివరాలు తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ ఎస్ఎంఎస్ ద్వారా పంపించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత జిల్లా అధికారి అభ్యర్థనను ఆమోదించిన పిదప వారికి ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియ చేస్తారని చెప్పారు. అభ్యర్థి తన ఎంప్లాయిమెంట్ కార్డు లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, డిఆర్ఓ బి.దయానిధి, డిఆర్‌డిఎ పిడి శచీదేవి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కే. శాంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి, జెసి జాహ్నవి తదితరులు

గణతంత్ర, ఓటర్ల దినోత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈ నెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవం, 25వ తేదీన జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 26వ తేదీన అనకాపల్లి ఎన్టీఆర్ మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఎటువంటి లోటు లేకుండా విజయవంతం చేయాలన్నారు. వివిధ శాఖలకు అప్పగించిన పనిని పూర్తిచేయాలని, జిల్లా అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని సజావుగా సాగేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందరికీ తెలిసేలా వివిధ శాఖల శకటాలను ప్రదర్శించాలన్నారు. అదే విధంగా 25వ తేదీన జరిగే ఓటర్ల దినోత్సవం నాడు ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఓటరు ప్రతిజ్ఞ' నిర్వహించాలని సూచించారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను మరింత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ తిరస్కరించిన దరఖాస్తులకు తిరస్కరణకు గల కారణాలను తెలియజేయాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమానికి 213 అర్జీలు వచ్చాయి.

'టిడిపితోనే బిసిలకు న్యాయం'

ప్రజాశక్తి-పరవాడ

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటుందని, టిడిపి హయాంలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పరవాడ మరిడి మాంబ కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన బీసీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక కుల వృత్తులు వారికి పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలిపారు. బీసీ భవనాల నిర్మాణం, రజకులకు దోభీ ఖనాలు, ఇస్త్రీ పెట్టెలు, నాయీ బ్రాహ్మణకులకు పనిముట్లు, శెట్టి బలిజలకు, విశ్వబ్రహ్మనలకు పనిముట్లు, వారి జీవన అభివృద్ధికి అనేక పథకాలు చేపట్టడం జరిగిందని, అలాగే యాదవులకు గొర్రెలు యూనిట్స్ ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైలా జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్ట సన్యాసి అప్పారావు, టిడిపి నాయకులు వియ్యపు చిన్న, నకిరెడ్డి చిన్నా రావు, రొంగలి గోపాల్‌కృష్ణ, బంధం రమణ, ఎంపీటీసీలు ఓమ్మి వెంకటరావు, అర్జిల్లి దేవి రవి, సురాడా బంగార్రాజు, రేసు పూడి రమణ, ఇందల కొండలరావు, శ్రీరామ్మూర్తి, బొండా సన్నిదేముడు, బొండా తాతారావు, సారిపల్లి జోగి నాయుడు, గొర్లి శ్రీనివాస్, కర్రి అప్పలరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

లెనిన్ విధానం సమాజానికి మేలు

ప్రజాశక్తి- అనకాపల్లి : సమ సమాజ స్థాపనకు లెనిన్ అనుసరించిన విధానం ఎంతో దోహద పడిందని జన సాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్‌వి శివాజీ రావు అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ భవన్‌లో ఆదివారం ప్రజాసాహితి లెనిన్ నూరవ వర్ధంతి ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు శివాజీరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏఐఎఫ్‌టియు (న్యూ) సీనియర్ కార్మిక నాయకులు ఆడారి అప్పారావు పత్రికని ఆవిష్కరించి మాట్లాడుతూ పెట్టుబడి దారీ విధానం తీవ్ర సంక్షోభంలో వుందని దాని ఫలితంగానే ప్రస్తుతం యుద్ధాలు జరుగుతున్నాయని తెలిపారు. తరువాత శివాజీరావు ప్రజాసాహితి పుస్తకాన్ని పరిచయం చేశారు. ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.గౌరీ శంకర్ లెనిన్ విద్యా విధానాన్ని పరిచయం చేశారు. జనసాహితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓవివిఎస్ రామకృష్ణ లెనిన్ సాహిత్య వివేచనని పరిచయం చేశారు. ఈ సభలో జన సాహితీ ప్రధాన కార్యదర్శి ఎస్ నూక చారి పాల్గొన్నారు.

మండలంలో 51,178 మంది ఓటర్లు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : తుది ఓటర్ల జాబితా ప్రకారం బుచ్చయ్యపేట మండలంలో 63 పోలింగ్ బూత్‌లకు గానూ 51178 మంది ఓటర్లు ఉన్నారని తహసిల్దార్ అరుణ్ చంద్ర తెలిపారు. సోమవారం ఆయన మండల ఓటర్ల జాబితాను వెల్లడించారు. వీరిలో పురుషులు 24929 మంది, మహిళలు 26249 మంది ఉన్నారన్నారు. పురుషుల కంటే 1320 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. గత అక్టోబర్లో ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 50,740 మంది ఓటర్లు ఉండగా, 438 ఓట్లు పెరిగినట్లు చెప్పారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : 138 సంవత్సరాల చరిత్ర కలిగిన గవరపాలెం గౌరీ పరమేశ్వర మహోత్సవం సందర్భంగా గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద కిట్ క్యాట్ వారి ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆస్క్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు కొణతాల బాలసుబ్రమణ్యం తెలిపారు. దానికి సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆయన రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బుద్ధ రాజేష్, మాజీ కౌన్సిలర్ పీలా నాగశ్రీను కొణతాల మాధవ, పైసా మాస్టర్, సుజీ, మధు, కొణతాల శ్రీను పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్‌బిఎస్ దేవి సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సంధ్భంగా అక్కడ అందే వైద్యసేవలు, పరీక్షలు, మందులు గురించి అడిగి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కార్డ్స్ పంపిణీ జరిగిన తీరును అడిగి తెలుసుకునున్నారు. అన్ని జాతీయ కార్యక్రమాలు శత శాతం పూర్తిచేయాలని, పిల్లల్లో రక్తహీనత లేకుండా విఫ్స్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అనంతరం వాడ్రాపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ ఆరోగ్యశ్రీ కార్డ్స్ పంపిణీ జరిగిన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దుర్గా ప్రవల్లిక, సిహెచ్ఓ ఆర్ దేవకాంత, పీహెచ్ఎన్ అనూరాధ, ఆరోగ్య పర్యవేక్షకులు వీఎస్ఎం లక్ష్మి, ఎం ఉమా మహేష్, పీహెచ్సీ సిబ్బంది విజయలక్ష్మి, రాజేశ్వరి, తులసి, ఏఎన్ఎం మంగ, ఆశా కార్యకర్తలు అదిలక్ష్మి, పాల్గొన్నారు.

గొన్నవానిపాలెం రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : కసింకోట-బంగారు మెట్టు రోడ్ నుండి గొన్నవానిపాలెం గ్రామానికి పోవు రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. గత రెండు రోజులుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న అంచులను జేసీబీతో మట్టి పనులను చేయిస్తున్నారు. అనంతరం తారు రోడ్డు నిర్మాణం చేపడతామని కాంట్రాక్టర్ తెలిపారు. సుమారు రూ.75 లక్షలతో పనులు ప్రారంభించినట్లు జడ్పిటిసి దొండ రాంబాబు, పి భీమవరం సర్పంచ్ పినపోలు రామునాయుడు తెలిపారు. దశాబ్దాల కలైన తారు రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

డిప్యూటీ సిఎం ముత్యాలనాయుడు

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బూడి

ప్రజాశక్తి- మాడుగుల:గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి గడపగడపకు వైయస్సార్ పథకాలను తెలియజేశారు. సుమారు 520 గృహాలను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సవివరంగా వివరించారు. ఎమ్.కోటపాడు, వల్లపురం గ్రామాలలో 163 మంది లబ్ధిదారుల జగనన్న గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లను అందజేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ 1.48 కోట్లతో ఇంటికి కుళాయిలు ఏర్పాటులో భాగంగా రెండు గ్రామాల్లో ఇళ్లకు 1050 కుళాయిలు ఏర్పాటు చేసి అదనపు నీటి అవసరాల నిమిత్తం 20 వేల లీటర్ల నీటి ట్యాంక్ ఏర్పాటు చేసామన్నారు. కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం అసంపూర్ణంగా శిథిలవస్థలో ఉన్న సామాజిక భవనాన్ని మంత్రి పరిశీలించారు.అసంపూర్ణంగా వున్న సిసి రోడ్లను, డ్రైనేజీలను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ కీముడు రమణమ్మ, ఎంపీపీ రామ ధర్మజ, మండల పార్టీ అధ్యక్షులు రాజారాం, మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావు, గ్రామ సర్పంచులు కరణం రాము, కరణం రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాబ్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యార్థులకు ట్యాబ్ల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరి, వైస్ ఎంపీపీ నానాజీలు ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్, హెచ్ఎం రాణి లలిత, వైసీపీ నాయకులు భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
రాజయ్య పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ విద్యార్థులకు ట్యాబ్ లను అందజేశారు.

మాట్లాడుతున్న రాజేష్

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం : టిడిపి

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికే ప్రజలంతా నిర్ణయించుకున్నారని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ తెలిపారు. గదంపాలెం పంచాయతీలో సోమవారం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, ఏ గ్రామంలో చూసినా టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధే తప్ప, వైసీపీ పాలనలో చేసింది శూన్యమని ఆరోపించారు. పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం అయ్యే విధంగా వైసీపీ వ్యవహరించిందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కానరావడంలేదన్నారు. ఎన్నికల్లో యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. ఓటర్లంతా ఓటు హక్కును వినియోగించుకునేలా యువత చూడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, నాయకులు లగుడు నానిబాబు, లాలం సత్యనారాయణ, త్రిమూర్తులు, చిట్టుమూరి లోవరాజు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు : ఎమ్మెల్యే గణేష్

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 28వ వార్డులో మౌలిక సదుపాయాలకు రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం శంకుస్థాపనలు చేశారు. వార్డులోని అయ్యన్న కాలనీలో రూ.7 లక్షలతో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి, రూ.2 లక్షలతో మంచినీటి బోర్ వెల్ తాగునీటి సరఫరా, గుర్రాల రోడ్డులో రూ 6 లక్షలతో రెండు డ్రైనేజీలు, రూ.15 లక్షలతో 4 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. మొదటి విడతగా నర్సీపట్నం మున్సిపాలిటీలోని 17 సచివాలయాల పరిధిలో రూ.3 కోట్ల 40 లక్షలతో 110 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మున్సిపాలిటీలోని ఒక్కో సచివాలయానికి మరో రూ.30 లక్షల చొప్పున రూ.5 కోట్ల 10 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో 170 అభివృద్ధి పనులు చేపట్టామని, ఇప్పటికే మంజూరైన పనులలో 140 పనులు పూర్తి చేశామని, 50 పనులు నిర్మాణంలో ఉన్నాయని, మిగతా పనులు త్వరలోనే పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పట్టణ వైసిపి అధ్యక్షుడు శివ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, కౌన్సిలర్ శిరసపల్లి నాని, వార్డు వైసిపి ఇన్చార్జ్ తెన్నేటి జాన్సన్, పట్టణ మహిళా కార్యదర్శి గంటా లలిత, కార్పొరేషన్ డైరెక్టర్లు చోటీ, అర్జున వెంకటరావు, కో ఆప్షన్ సభ్యురాలు రోజా, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరుగొల్లు రాజబాబు, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, మున్సిపల్ డి ఈ నారాయణ, ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి రామధర్మజ రాజీనామా

రాజీనామా లేఖను ఇస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి - మాడుగుల : ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు రామధర్మజ ప్రకటించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఎంపీపీ వేమవరపు రామధర్మజ తన వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఎంపీపీ పదవికి మాత్రమే తాను రాజీనామా చేశానని, ఎంపీటీసీగా కొనసా గుతూ వైయ స్సార్సీపి పార్టీలో ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. తన రాజీనామాను అనకాపల్లి జిల్లా పరిషత్ సీఈవోకు అందజేశారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మాడుగుల: స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాలలో ఆయుష్ వాల్నెస్ హెల్త్ సెంటర్ (ఏ డబ్ల్యు హెచ్ సి)లో యోగా గురువు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ పోస్టులకు గాను అనుభవజ్ఞులైన ఆసక్తిగల స్త్రీ. పురుషులు అభ్యర్థుల నుండి ఆహ్వానం కోరుతున్నట్లు ఏడబ్ల్యుఎచ్సి వైద్యాధికారి వెంకటేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. యోగా లో పీజీ లేదా డిప్లమో చేసినవారు అర్హులన్నారు. నెలలో పురుషులకు 32 గంటలు, స్త్రీలకు 20 గంటల పని దినాలుగా నిర్ణయించామన్నారు. పురుషులకు నెలకు రూ.8000, స్త్రీలకు నెలకు రూ.5000 ఇస్తామన్ని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ చివరి తేదీ అని, మరిన్ని వివరాలకు ఫోన్:9849530266 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మాట్లాడుతున్న అధికారులు

సోషల్ ఆడిట్పై నివేదిక ఇవ్వాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఉపాధి సోషల్ ఆడిట్ పై సమగ్ర నివేదిక ఇవ్వాలని, ఆడిట్ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, ఏపీవో గంగు నాయుడు తెలిపారు.మండల సమావేశం మందిరంలో సోమవారం మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పనులు, సహ సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై నివేదిక తప్పనిసరిగా అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి బానోజీరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

-ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రామలక్ష్మి

నక్కపల్లిలో మాట్లాడుతున్న రామలక్ష్మి

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.రామలక్ష్మి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు.ఓటర్ జాబితా పక్కాగా ఉండే విధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లు ఎన్వి అంబేద్కర్, జై ప్రకాష్, జానకమ్మ, పలు రాజకీయ పార్టీల నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, వీసం నానాజీ, మేడిటి శంకర్, రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

ఓటర్ల తుది జాబితా ప్రదర్శన

కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులు రూపొందించిన ఓటర్ల తుది జాబితాను తహసిల్దార్ జానకమ్మ సోమవారం కార్యాలయం వద్ద ప్రదర్శించారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులకు అందజేశారు. గ్రామాల్లో అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జానకమ్మ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 52 పోలింగ్ బూత్ కేంద్రాలకు పురుషులు 21422, మహిళలు 22391 కలిసి మొత్తం 43813 మంది ఉన్నట్లు తెలిపారు.ఈ నెల 25న ఓటర్ దినోత్సవ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.


కోటవురట్లలో జాబితాను ఇస్తున్న తహశీల్దార్

జనసేన బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:జనసేన పార్టీ బలో పేతానికి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం నర్సీపట్నం ఎన్టీవో హోంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియ జేస్తూ వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అద్దేపల్లి గణేష్, నాయకులు సేనపతి శేషు గండం దొరబాబు, వెంకటరమణ, మోపాడు చిరంజీవి, నమ్మి రమణ రాజు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై నిరసనల హోరు

-అఖిలపక్ష, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీలు, మానవహారాలు

విశాఖలో ర్యాలీ చేపడుతున్న అఖిల పక్ష నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

'జగనన్నకు చెబుదాం' పేరిట విజయవాడ బయలుదేరిన అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ సోమవారం అఖిలపక్ష, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసనలు హోరెత్తాయి. ఎక్కడికక్కడ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు.

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, అక్రమ అరెస్టులను ఖండిస్తూ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. గురజాడ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వేతనాలు పెంచాలని గత 42 రోజుల నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా, వీరి జీతాలు పెంచకపోగా విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా "జగనన్నకు చెబుదాం" పేరుతో కోటి సంతకాలు సేకరించారని, ఈ పత్రాలను ముఖ్యమంత్రికి అందజేయడానికి విజయవాడకు వెళ్లగా ప్రభుత్వం అంగన్‌వాడీలపై తీవ్ర నిర్బంధం విధించి అర్ధరాత్రి నుండి ఎక్కడక్కడ అరెస్టులు చేసారని తెలిపారు. ఇది దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీలపై తక్షణమే నిర్బంధం అపాలని, వారి జీతాలు పెంచాలని, అరెస్టులు చేసిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, తక్షణమే చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, పి.వెంకటరావు, ఎన్.ప్రకాశరావు, శ్రావణ్‌కుమార్, ఎఐటియుసి జిల్లా నాయకులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎం.మన్మధరావు, ఎస్‌కె.రెహ్మాన్, కాసుబాబు, ఐఎఫ్‌టియు నాయకులు వె.కొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు, పి.లక్ష్మి, ఐద్వా నాయకులు బి.పద్మ, ప్రభావతి, కుమారి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకులు పుష్ప, వనజాక్షి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై.తులసి, శ్యామల, రామలక్ష్మి, ఆశా వర్కర్స్ జిల్లా కార్యదర్శి వి.మేరీ, పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

నిర్బంధం ఆపాలని వినతి

అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం తక్షణమే ఆపి, యూనియన్ నాయకులతో చర్చించి వేతనాలు పెంచాలని వామపక్షపార్టీలు, అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విశాఖ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) కార్యదర్శి వై.కొండయ్య, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి శంకరరావు, ఎస్‌యుసిఐ (సి) గోవిందరాజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, అధ్యక్షుడు ఎం.మన్మధరావు, ఐఎన్‌టియుసి నాయకులు కె.ఈశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు పి.లక్ష్మి, పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి తదితరులు ఉన్నారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ, అంగన్‌వాడీ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంధోరణని ప్రదర్శించడం సరికాదన్నారు. ఎన్నికలు ముందు జీతాలు పెంచు తామని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేస్తామన్న హామీని అమలు చేయమని 42రోజులుగా సమ్మెచేస్తున్నా మొండిగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు.

గొలుగొండలో

అనకాపల్లిఅంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధానికి నిరసనగా సోమవారం జిల్లా వ్యాప్తంగా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించారు. అనకాపల్లిలో స్థానిక సిఐటియు కార్యాలయం నుండి నాలుగు రోడ్ల వరకు భారీ ప్రదర్శన నిర్వహించి, నెహ్రూచౌక్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఇందులో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని, 42 రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీసం పట్టించుకోలేదని పేర్కొన్నారు. శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకోవడానికి వెళ్తున్న

చోడవరంలో అంగన్‌వాడీలను లాకెలుతున్న పోలీసులు

అంగన్వాడి కార్యకర్తలను దేశద్రోహులా ఎక్కడికి అక్కడ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, జి దేముడు నాయుడు, కె.సోమునాయుడు (సిఐటియు), డిడి వరలక్ష్మి (ఐద్వా), కర్రి అప్పారావు, గండి నాయనబాబు (రైతు సంఘం), బి ఉమామహేశ్వరరావు (పట్టణ పౌర సంక్షేమ సంఘం), ఎ.రాజు (డివైఎఫ్ఐ), భవాని, పద్మ, ఆదిలక్ష్మి (అంగన్వాడి యూనియన్) పాల్గొన్నారు.

చోడవరం : చోడవరంలో కొత్తూరు జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో తమను కూడా అరెస్టు చేయాలని మిగతా అంగన్వాడీ పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్టయి వారిలో సిఐటియు నాయకులు జి వరలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సూర్యకాంతం ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి : సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన సోమవారం రాంబిల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయలు శివాజీ, నాయకులు సిహెచ్.ప్రసాద్, సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, నాయకులు ధనరాజు, సిహెచ్.పవన్, చిన్న, ఐద్వా నాయకులు నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ప్రజా సంఘాల ఆధ్వర్యాన సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం నుండి మండల పరిషత్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ రాస్తారోకో చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, అంగన్వాడి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : అంగన్వాడీల అక్రమ అరెస్టును ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి డౌన్ డౌన్, మహిళలపై పోలీసుల దౌర్జన్యం నశించాలి, ఎస్మా చట్టం రద్దు చేయాలి అంటూ నినదించారు.

నక్కపల్లి:అంగన్వాడీల అక్రమ అరెస్టులు అన్యాయమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు అన్నారు. అంగన్వాడీల సమ్మె లో భాగంగా జగనన్నకు చెబుదాం కోటి సంతకాలు పేరు తో ఛలో విజయవాడ కార్యక్రమం తలపెట్టారు. అంగన్వాడి వర్కర్స్ ను విజయవాడ వెళ్లకుండా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నక్కపల్లిలో అంగన్వాడి వర్కర్స్ నిరసన చేపట్టారు.స్థానిక సిఐటియు కార్యాలయం నుండి జాతీయ రహదారిని ఆనుకుని వెంకన్న ఆర్చి వరకు ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు వరలక్ష్మి, కవిత, పద్మ, సత్యవతి, మంగలక్ష్మీ, విజయ, మసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో....

గొలుగొండ:అంగన్వాడి వర్కర్లను నిర్బంధించి విజయవాడకు వెళ్లకుండా అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి సరైన పద్ధతి కాదని సిఐటియు నాయకులు ఈ ఒల్లి చిరంజీవి తెలిపారు. గొలుగొండ మెయిన్ రోడ్డుపై అంగన్వాడీలు అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలపై వివక్ష చూపించడం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎన్ని ఆటంకాలు కలగచేసినా పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అంగన్వాడీలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో భ్రమరాంబ, రమణమ్మ, భవాని పాల్గొన్నారు

మాడుగుల: అంగన్వాడీలపై వైసీపీ ప్రభుత్వ చర్యలు దుర్మార్గమని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు విమర్శించారు. మాడుగుల పోలీస్ స్టేషన్‌లో ఉన్న అంగన్వాడీ సిబ్బందిని సోమవారం పైలా ప్రసాదరావు పరామర్శించారు. అంగన్వాడీల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు గట్టి బుద్ది చెప్పడం ఖాయమని పైలా అన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రంజిత్ వర్మ, క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, కొట్నాల త్రినాథ్, లెక్కల కాసుబాబు, ఢిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పై ప్రభుత్వ నిర్బందాన్ని ఖండీస్తూ దిష్టి బోమ్మ దగ్ధం

నర్సీపట్నం టౌన్ :స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అంగన్‌వాడీలను ఛలో విజయవాడకు వెళ్లకుండా నాతవరం, నర్సీపట్నం పోలీసు స్టేషన్‌లకు తరలించి ఇబ్బందులకు గురి చేసారని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల ం ా జు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు దే వ ు ు డ ు నాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పెందుర్తి : చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న తమను జివిఎంసి 97వ వార్డు చిన ముషిడివాడలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్బంధించడాన్ని నిరసిస్తూ సోమవారం అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, అక్కడ రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్ మాట్లాడుతూప్రభుత్వం స్పందించి, సమస్యలను పరిష్కరిస్తే రోడ్డెక్కి ఆందోళన చేసేవారా? అని ప్రశ్నించారు. అంగన్వాడీలు దేవి, భవాని పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న నేతలు

భీమునిపట్నం: నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు కార్యక్రమంలో రేవిడి, మధురవాడ సెక్టార్లకు చెందిన అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. వీరికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు.

రాంబిల్లిలో...